

## జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించాలి

**ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి జ్వర బాధితుల వివరాలను మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యులు, అధికారులను ఆదేశించారు.

రోగితో మాట్లాడుతున్న మంచిర్యాల ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో అనిత

# మడత మంచాలపై వైద్యం

## బెడ్స్, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో రోగుల అవస్థలు

- వానల అనంతరం ప్రారంభమైన సీజనల్ వ్యాధులు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ దవాఖానలు
- రోజు వందల సంఖ్యలో హాస్పిటల్స్‌కు వ్యాధిగ్రస్తుల రాక
- పదుల సంఖ్యలో డెంగీ కేసుల అనుమానితులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



● 'ముసురు'కున్న వ్యాధులు

మడత మంచాల్లో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు



మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు వైద్యచికిత్స కోసం బారులు

మంచిర్యాల అర్బన్, జూలై 30 : పది రోజులుగా వర్షం ఎడతెరిపిలేకుండా కురవడంతో సీజనల్ వ్యాధులు ముసురుకున్నాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులు రావడం, కొత్త నీరు రావడంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాలు, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పీహెచ్‌సీలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రోజు పెద్దాసుపత్రులకు 300లకు పైగా, పీహెచ్‌సీలకు పదుల సంఖ్యలో రోగులు రావడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. దీనికి తోడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జనరల్ దవాఖాన 200 పడకల సామర్థ్యం కలిగి ఉండడంతో బెడ్లు సరిపోవడం లేదు. దీంతో వైద్యాధికారులు మడత మంచాలపై రోగులకు వైద్యం అందిస్తున్నారు. కనీసం బెడ్లు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వానకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి చికిత్స కోసం వస్తున్న గర్భిణులు, బాలింతలు, శిశువులు కూడా జ్వరాల బారిన పడుతున్నారు.

### పదుల సంఖ్యలో డెంగీ కేసుల అనుమానితులు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, మూడు కమ్యూనిటీ ఆసుపత్రులు, మూడు బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు, ఆరోగ్య ఉపకేంద్రాలు ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. జనవరి, ఫిబ్రవరిలో రెండు డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతోపాటు వారం రోజులుగా అధిక సంఖ్యలో జ్వ రాలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగనిర్ధారణ పరీక్షలు టీ–హబ్ ద్వారా నిర్వహిస్తున్నారు. జ్వరంతో వచ్చే వారికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేస్తున్నారు. ఒకవేళ ఎలీసా పరీక్షల్లో డెంగీ పాజిటివ్ కేసులు వస్తే వైద్యం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### జాగ్రత్తలు తీసుకోవాలి..

అధికంగా సాధారణ జ్వరాల కేసులు వస్తున్నాయి. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో 14 జ్వరాలకు సంబంధించిన కేసులు మాత్రమే అడ్మిట్ ఉన్నాయి. ఇప్పటివరకు డెంగీ పాజిటివ్ కేసులు రాలేదు. ఏ రోజు కారోజు రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. వచ్చిన రిపోర్ట్ ప్రకారం చికిత్స అందిస్తున్నాం. సర్జరీ, ఆర్థోపెడిక్ వార్డులకు ఫీవర్ రోగులను ఉంచకుండా సెపరేట్‌గా పడకలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నాం. దీనికి తోడు ప్రజలు దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.


**- హరీశ్‌చంద్రారెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ దవాఖాన, మంచిర్యాల.**



వరండాలో మడత మంచాల్లో చికిత్స పొందుతూ..

### మంచిర్యాల జిల్లాలో డెంగీ పాజిటివ్ కేసులు

| సంవత్సరం | కేసులు |
|---|---|
| 2020 | 32 |
| 2021 | 118 |
| 2023 | 74 |
| 2024 | (ఇప్పటివరకు)02 |





మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

## ● చెన్నూర్ ప్రభుత్వ దవాఖాన

### జ్వరాల పంజా



చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

చెన్నూర్, జూలై 30 : చెన్నూర్, కోటపల్లి మండలాల్లోని గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరం బారిన పడిన వారి సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు జ్వర బాధితులతో కిక్కిరిసి పోతున్నాయి. జ్వరాలతోపాటు డయేరియా కూడా కొన్ని గ్రామాల్లో ప్రబలుతున్నది. పది రోజు నుంచి చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు రోజు వంద మందికి పైగా జ్వర, డయేరియా బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. జ్వరం తీవ్రత తక్కువ ఉన్న వారు ఔట్ పేషెంట్‌గా చికిత్స పొందుతుండగా, తీవ్రంగా జ్వరం ఉన్న వారు దవాఖానలో చేరి రెండు, మూడు రోజులు ఉండి చికిత్స పొందుతున్నారు.

### జాగ్రత్తలు తీసుకోవాలి..



వర్షాకాలంలో జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. వర్షాకాలంలో జ్వరాలు, డయేరియా వంటి వ్యాదులు ప్రబలే అవకాశం ఉంది. కరోనా సమయంలో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉన్నారో, సీజనల్ వ్యాధుల సమయంలో కూడా అలాగే ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు కలుషిత నీరు, ఆహారాన్ని తీసుకోవద్దు. పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. జ్వరం, డయేరియాతో బాధపడుతూ దవాఖానకు వస్తున్న వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నాం.

***- డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్, ప్రభుత్వ దవాఖాన చెన్నూర్.***



చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం వచ్చిన రోగులు

### రోజూ 200 మంది ఔట్ పేషెంట్లు

బెల్లంపల్లి, జూలై 30 : బెల్లంపల్లి వంద పడకల దవాఖానలో రోజు 200 నుంచి 250 మంది సగటున వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో 20 నుంచి 25 మంది అడ్మిట్ అవుతున్నారు. జ్వరపీడితులు అధికంగా వస్తుండగా.. వాంతులు, విరోచనాలు, బలహీనంగా ఉండడం, ఇతర సమస్యలు ఉన్నవారు చికిత్సలు చేయించుకుంటున్నారు. ఓపీ చూడడానికి ఒకరిద్దరు వైద్యులు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నామమాత్రపు సెలైన్లు, ఇతర మందులిచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోగులు కాస్త సీరియస్‌గా ఉంటే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు రెఫర్ చేస్తున్నారు.



● బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖాన

బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

# గుణాత్మక విద్యనందించాలి

కెరమెరి, జూలై 30: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించాలని ఉపాధ్యాయులను ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ ఆదేశించారు. మంగళవారం హట్టి, అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు కెరమెరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మురుగు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రతి విద్యార్థికీ చదవడం, రాయడం వచ్చేలా చూడాలన్నారు. అనంతరం అనార్‌పల్లి పీజీ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆమె వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.



హట్టి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## ఆశ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సరికాదు



పోలీస్‌స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు


కాగజ్‌నగర్, జూలై 30: హక్కుల సాధనకు మంగళవారం 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్తున్న ఆశ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సరికాదని సీపీఎం పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్ మంగళవారం అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఉద్యమాలను అణచివేసే కుట్రలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు.

# అర్హులందరికీ రెండో విడుత రుణమాఫీ

- సందేహాలుంటే అధికారులను సంప్రదించాలి
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్ : రుణమాఫీ చెక్కులను అందజేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



మహిళా రైతుకు రుణమాఫీ చెక్కును అందజేస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, జూలై 30 : అర్హులైన రైతులందరికీ రెండో విడుత రుణమాఫీని ప్రణాళికాబద్ధంగా అమలు చేసినట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం రెండో విడుత రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, డీఆర్డీవో కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ రెండో విడుతలో రూ.లక్ష నుంచి 1.50 లక్షల వరకు రుణ మాఫీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండో విడుతలో 14104 మంది రైతులకు రూ.138,46, 56,254 అందించినట్లు తెలిపారు. మొదటి విడుతలో 28727 మంది రైతులకు రూ. 151,27,19,35ను వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రైతుల సందేహాలు, సమస్యలపై కంట్రోల్ రూమ్ 08736–250501 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం ఇద్దరు రైతులకు రుణమాఫీ చెక్కులను అందించారు.

### ప్రణాళికాబద్ధంగా రుణమాఫీ..

**-ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 30 :రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రెండో విడుత రుణమాఫీ పథకాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ శాసనమండలి ప్రాంగణం నుంచి రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులతో కలిసి రెండో విడుత రైతు రుణమాఫీ పథకం నిధులను వర్చువల్ విధానం ద్వారా విడుదల చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జ్యోషితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ విడుతలో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణం మాఫీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 14,623 మంది రైతులకు రూ.153,34,94379 కోట్లను వారి ఖాతాలు జమ చేస్తామని తెలిపారు. రుణమాఫీలో ఏవైనా సమస్యలుంటే కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. రైతులకు బ్యాంకు అధికారులు ఇబ్బంది కలిగించవద్దని ఆదేశించారు. అనంతరం రూ.153 కోట్లు రుణమాఫీ చెక్కును అధికారులతో కలిసి ఆవిష్కరించి ఐదుగురు రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తులం బంగారం ఎప్పుడిస్తరు..?

### అసెంబ్లీలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 30: కల్యాణ లక్ష్మి పథకం కింద రూ.లక్షతోపాటు ఇస్తామన్న తులం బంగారం లబ్ధిదారులకు ఎప్పుడిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే 6 గ్యారెంటీలను అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు కేసీఆర్ సర్కారు ఇచ్చిన మాదిరిగానే ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులకు మరమ్మతులు చేయాలని కోరారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679